# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 13-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అల్జీరియా, మౌరిటానియా మలావి దేశాల పర్యటన కోసం ఈ రోజు ఢిల్లీ నుండి బయల్దేరి వెళ్లారు.
- ❖ దేశ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంలో "పీఎం గతిశక్తి" కీలక పాత్ర పోషించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతోషం వ్యక్తం చేశారు.
- ❖ దేశ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు.
- ❖ రానున్న 5 రోజుల్లో దక్షిణ కర్ణాటక, కేరళ, తమిళనాడులో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.

=======================

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అల్జీరియా, మౌరిటానియా మలావి దేశాల పర్యటన కోసం ఈ రోజు ఢిల్లీ నుండి బయల్దేరి వెళ్లారు. ఆఫ్రికన్ యూనియన్ జీ-20 గ్రూప్‌లో భారత్ శాశ్వత సభ్యునిగా చేరిన తరువాత రాష్ట్రపతి ఈ మూడు ఆఫ్రికన్ దేశాలను సందర్శించడం ఇదే తొలిసారి. రాష్ట్రపతి ఈ రాత్రికి అల్జీరియా చేరుకోనున్నారని అధికార వర్గాలు తెలిపాయి. అల్జీరియాలో 3 రోజుల పర్యటన సందర్భంగా పీపుల్ డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ అల్జీరియా అధ్యక్షుడు అబ్దెల్మాజ్జిద్ టెబౌన్ ఇతర ప్రధాన నాయకులతో రాష్ట్రపతి ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహిస్తారు. అల్జీరియాలోని మకామ్ ఎచాహిద్, అమరవీరుల స్మారక చిహ్నం వంటి ముఖ్యమైన సాంస్కృతిక చారిత్రక ప్రదేశాలను కూడా రాష్ట్రపతి సందర్శిస్తారు, అదే విధంగా ఇండియా - అల్జీరియా ఎకనామిక్ ఫోరమ్‌లో ఆమె ప్రసంగించనున్నారు. 2వ విడత పర్యటనలో, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 16వ తేదీన మౌరిటానియాను సందర్శిస్తారు. చివరి దశ పర్యటనలో రాష్ట్రపతి 17 నుండి 19వ తేదీ వరకు మలావిలో పర్యటిస్తారని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

=======================

పీఎం గతిశక్తి  జాతీయ బృహత్ ప్రణాళికకు 3 సంవత్సరాలు పూర్తి కావడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు సామాజిక మధ్యమం ద్వారా సంతోషం వ్యక్తం చేశారు. భారతదేశ మౌలిక సదుపాయాలను విప్లవాత్మకంగా మార్చడంలో ఈ ప్రయత్నం ఒక అనుకూల పరిణామంగా మారిందని ఆయన పేర్కొన్నారు. పీఎం గతిశక్తి బహుళమైన అంశాలకు సంబంధించిన  అనుసంధానాన్ని విస్తృతంగా పెంపొందించిందని గుర్తు చేశారు. అన్ని రంగాల్లో వేగవంతమైన సమర్థవంతమైన అభివృద్ధి కనిపిస్తోందని అన్నారు. ఏకీకృతమైన మౌలిక సదుపాయాలను కల్పించడానికి, జాప్యాలను తగ్గించడానికి, అనేక మందికి కొత్త అవకాశాలను సృష్టించడానికి పీఎం గతిశక్తి దోహదపడిందని నరేంద్ర మోడీ తెలిపారు. ఇదిలా ఉండగా, ఈరోజు న్యూ ఢిల్లీలోని భారత్ మండపంలో ఉన్న పీఎం గతి శక్తి అనుభూతి కేంద్రాన్ని ప్రధానమంత్రి సందర్శించారు. పీఎం గతి శక్తి ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా ప్రాజెక్టుల ప్రణాళికతో పాటు అమలులో సాధించిన పురోగతిని ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

=======================

దేశ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పూర్వ ఉపరాష్ట్రతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈ రోజు నిర్వహించిన “అలయ్ బలయ్” కార్యక్రమంలో హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ... నేటి సమాజానికి సమైక్యత ఎంతో ముఖ్యమని తెలిపారు. కుటుంబం, ప్రాంతం, దేశం, ప్రపంచం అనే సమైక్యత భావన పెరగాలని వెంకయ్యనాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 34 సెకన్లు)

=======================

రానున్న 5 రోజుల్లో దక్షిణ కర్ణాటక, కేరళ, తమిళనాడులో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. రాబోయే 2 రోజుల్లో అండమాన్ నికోబార్ దీవులు, అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్ త్రిపురలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని కూడా ఐఎండీ అంచనా వేసింది. కాగా, గుజరాత్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, బీహార్, పశ్చిమ బెంగాల్, సిక్కిం, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలోని మరికొన్ని ప్రాంతాల నుంచి రానున్న 2 రోజుల్లో నైరుతి రుతుపవనాలు మరింత ఉపసంహరించుకునేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత  వాతావరణ శాఖ  తెలిపింది.

=======================

అస్సాంలో స్వల్ప భూకంపం సంభవించింది. ఈ రోజు ఉదల్‌గురిలో 4.2 తీవ్రతతో భూమి కంపించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ (ఎన్‌సిఎస్) తెలిపింది. 15 కిలో మీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు పేర్కొంది. అయితే ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం గురించి ఎలాంటి నివేదికలు అందలేదని అధికార వర్గాలు తెలిపాయి

విరామం

=======================

ప్రపంచ వ్యాప్తంగా ప్రమాదాల తగ్గింపు కోసం అంతర్జాతీయ విపత్తు దినోత్సవాన్ని ఈ రోజు అన్ని దేశాలలోనూ జరుపుకుంటున్నారు. ప్రమాదాల పైన అవగాహనను  పెంపొందించడం. అదే అంశం మీద పెద్ద ప్రచారం చేయడం ఈ రోజు లక్ష్యం. రేపటి తరానికి మంచి భవిష్యత్తు కల్పించడం. అదే విధంగా ప్రమాదాల రహిత భవిష్యత్తు కోసం యువతను శక్తివంతం చేయడం.  ప్రాథమిక విద్య  బోధనలోనూ ఈ అంశాలు చేర్చడం, ఈ సంవత్సరానికి సంబంధించిన అంశం ఏమిటంటే ప్రమాదాలు లేని సమాజం కోసం అంతా కలసి కృషి చేయాలన్నదే ఈ రోజు ముఖ్య ఉద్దేశ్యం.

=======================

పశ్చిమ బెంగాల్‌లో దుర్గాపూజ ముగిసిన తరువాత ఈ రోజు విగ్రహాల నిమజ్జనం ప్రారంభమైంది. నిన్న కూడా కొన్ని గృహాల పూజల విగ్రహాలను నిమజ్జనం చేశారు. నిమజ్జనం సందర్భంగా ముఖ్యమైన నదులు, చెరువుల ఘాట్‌ల వద్ద అధికార యంత్రాంగం భద్రతా ఏర్పాట్లు చేసింది. గంగానది ఘాట్‌లతో సహా ఇతర నదులు చెరువుల వద్ద విగ్రహ నిమజ్జనం కోసం సర్వం సిద్ధం చేశారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రివర్ ట్రాఫిక్ పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు. అదే విధంగా అస్సాంలో ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా దుర్గా విగ్రహాల నిమజ్జనం జరుగుతోంది. నిమజ్జనం సందర్భంగా పాటించాల్సిన మార్గదర్శకాలను అధికార యంత్రాంగం జారీ చేసింది. దుర్గామాతకు ఘనంగా వీడ్కోలు పలికేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పూజావేదికల వద్దకు చేరుకున్నారు. గౌహతి నగరంలో బ్రహ్మపుత్రలో నిమజ్జనం ఉత్సాహంగా సాగుతోంది.

=======================

దేశ రాజధానిలో విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఢిల్లీ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందులో భాగంగా ప్రభుత్వ నిధులతో నడిచే కళాశాలలకు వంద కోట్ల రూపాయల నిధులను ఈరోజు విడుదల చేసింది. 2024 - 2025 ఆర్థిక సంవత్సరంలో కళాశాలలకు 400 కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయింపులు జరిపినట్టుగా తెలిపింది.

=======================

ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 24వ తేదీన దేశంలోని అన్ని ముఖ్యమైన భవనాలపై జాతీయ త్రివర్ణ పతాకంతో పాటు ఐక్యరాజ్యసమితి జెండాను ఎగురవేయాలని హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ కోరింది. రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల్లోని అన్ని కేంద్ర విభాగాలు, పరిపాలనా భవనాల మీద ఐక్య రాజ్య సమితి పతాకం ఎగరవేయాలని సూచించింది. అయితే  రాష్ట్రపతి భవన్, ఉపరాష్ట్రపతి భవనం, పార్లమెంట్ హౌస్, సుప్రీం కోర్టు భవనం, రాజ్ భవన్, శాసన మండలి, శాసన సభల భవనాలపై ఐక్యరాజ్యసమితి జెండాను ఎగురవేయరాదని మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది.

=======================

ముంబై లోకల్ ట్రైన్‌కు చెందిన రెండు బోగీలు ఈరోజు పట్టాలు తప్పాయి. దీంతో పశ్చిమ రైల్వే డివిజన్‌లో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. ముంబై సెంట్రల్ నుంచి కార్ షెడ్‌లోకి వెళ్తుండగా ఖాళీగా ఉన్న ఈ.ఎం.యూ. రేక్‌కు చెందిన రెండు కోచ్‌లు పట్టాలు తప్పినట్టు వెస్ట్రన్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ అధికారి వినీత్ అభిషేక్ తెలిపారు. రైలు ఖాళీగా ఉండటంతో ఈ ఘటనలో ఎవరూ గాయపడినట్లుగా సమాచారం అందలేదని పేర్కొన్నారు. అయితే బోగీలు పట్టాలు తప్పడంతో సబర్బన్ సేవలకు అంతరాయ కలిగిందన్నారు.

=======================

ఐసీసీ మహిళల టీ20 ప్రపంచ కప్ 2024లో భాగంగా భారత్ - ఆస్ట్రేలియా జట్ల మధ్య కీలక మ్యాచ్ జరుగుతోంది. యూఏఈలోని షార్జా క్రికెట్ స్టేడియంలో టాస్ గెలిచిన ఆస్ట్రేలియా మహిళల జట్టు 11 ఓవర్లకు 2 వికెట్ల నష్టానికి 70 పరుగులు చేసింది. టీమిండియా సెమీఫైనల్‌కు చేరుకోవడానికి ఈ మ్యాచ్ చాలా కీలకం కానుంది.

=======================

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకపోతే మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని ఆ రాష్ట్ర సీనియర్ వైద్యుల బృందం స్పష్టం చేసింది. పశ్చిమ బెంగాల్ లోని కోల్ కతా ఆర్జీ కర్ ఆసుపత్రిలో ట్రైనీ జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటనకు సంబంధించి  బాధితురాలి కుటుంబానికి మద్దతుగా పలువురు జూనియర్ వైద్యులు ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. ప్రస్తుతం వారిలో పలువురి పరిస్థితి విషమించింది. నిరాహార దీక్ష చేస్తున్న బాధితులకు 75 మంది సీనియర్ వైద్యులు మద్దతు తెలిపారు. ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న జూనియర్ వైద్యులకు సంఘీభావంగా

రాజీనామా చేయడానికి తామంతా సిద్ధమేనని తెలిపారు. రేపటి నుండి విధుల్లో పాల్గొనవద్దని నిర్ణయించుకున్నట్లు పశ్చిమ బెంగాల్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు ఇమెయిల్ ద్వారా వారు  తెలియజేశారు.

========================

========================